




# ఈకాలం వార్త

THE HONEST TELUGU DAILY

శుక్రవారం 09- 10- 2026 | పేజీలు : 5 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :343 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : దేవేందర్ నూకల







# సుపరిపాలనకు

## మొబైల్ ఫోన్ ఓ మంచి టూల్: మోదీ

- మొబైల్ సాంకేతికత సుపరిపాలనకు వారధి.
- 5జీతో ప్రతి జిల్లాకు వేగవంతమైన ఇంటర్నెట్.
- DBTతో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి సాయం.
- సైబర్ మోసాలు, డీప్‌ఫేక్‌లపై కొత్త టెక్నాలజీ అవసరం.



ఒకప్పుడు మాట్లాడుకోవడానికి, సందేశాలు పంపించేందుకు మాత్రమే ఉపయోగపడిన మొబైల్ ఫోన్.. నేడు సుపరిపాలన కు వారధిగా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రభుత్వ సేవలను ఇది ప్రజల అరచేతిలోకి తీసుకొచ్చిందని పేర్కొన్నారు. గురువారం జరిగిన ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2026లో ప్రసంగించిన మోదీ.. డిజిటల్ ఇండియా ప్రయాణాన్ని వివరించారు.

“5జీ సేవల విస్తరణతో దేశంలో ఇంటర్నెట్ వేగం గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం ప్రతి జిల్లాకు 5జీ కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చింది. మొబైల్ సాంకేతికతతో ప్రయాణ సమయం, నిరీక్షణ, ఖర్చులు తగ్గాయి. గేమింగ్, కంటెంట్ క్రియేషన్ వంటి కొత్త రంగాల్లో యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయి. డిజిటల్ సేవల ద్వారా ప్రభుత్వ పథకాలు ప్రజలకు వేగంగా చేరుతున్నాయి. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (ఐడీు)తో నేరుగా లబ్ధిదారుల ఖాతాకే ప్రభుత్వ సంక్షేమ పథకాల సాయం చేరుతోంది. దీంతో రూ.5 లక్షల కోట్ల మేర సొమ్మును తప్పుడు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా అరికట్టగలిగాం” అని ప్రధాని మోదీ వివరించారు.

### సుప్రీంకోర్టు న్యాయమూర్తులంతా ఒకే ధర్మాసనంపై..

సాంకేతికత కొద్దిమందికే పరిమితం చేయకుండా, ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

2లో▸



## మూడోరోజు మొదలైన నిరసనలు..

### రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు

- CEC జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ఇండియా కూటమి నేతల నిరసన.
- విపక్ష ఎంపీలు రాజ్‌ఘాట్ వద్ద నివాళులు అర్పించారు.
- రాహుల్‌గాంధీ మోదీ, అమిత్‌షా తదితరులపై తీవ్ర ఆరోపణలు చేశారు.
- విపక్ష ఎంపీలు రాష్ట్రపతి ముర్మును కలిసి వినతిపత్రం ఇవ్వనున్నారు.

ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ.. దేశ రాజధాని దిల్లీలో కాంగ్రెస్ సహా ఇండియా కూటమి నేతలు నిరసనకు దిగారు. ఆందోళనల్లో భాగంగా తొలుత విపక్ష ఎంపీలంతా కలిసి రాజ్‌ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు.

“300 మంది ఎంపీలందరం కలిసి ప్రశాంతంగా ఆందోళన చేయాలనుకుంటున్నాం. నిన్న జంతర్‌మంతర్ వద్దకు వెళ్లాలని ప్రయత్నించాం. కానీ మమ్మల్ని అనుమతించలేదు. మొదటి రోజు మమ్మల్ని ఎన్నికల సంఘం వద్దకు వెళ్లకుండా ఆపారు. ఆ తర్వాత నిన్న జంతర్ మంతర్‌కు వెళ్లి నిరసన తెలియజేస్తామని అడిగితే.. మమ్మల్ని ఆపేశారు. మా వాళ్లను కొట్టారు. వాళ్లకు శిక్ష పడుతుంది. ఇది మా హామీ. ప్రజాస్వామ్యాన్ని హత్య చేసేందుకు మోదీ, అమిత్‌షా, మోహన్ భాగవత్, జ్ఞానేశ్ కుమార్ కుట్ర పన్నుతున్నారు. ఆ నలుగురికి శిక్ష పడటం మీరే చూస్తారు” అని రాహుల్ అన్నారు.

2లో▸

## జీఎస్టీ సంస్కరణల్లో రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడాలి

### నిజాయితీ పన్నుదారులకు సులభమైన విధానం.. పన్ను మోసాలపై కఠిన చర్యలు




- తెలంగాణకు ఏటా రూ.800 కోట్లకుపైగా ఆదాయ ప్రభావం.. మరింత ఆర్థిక నష్టం జరిగే అవకాశం
- హైదరాబాద్‌లో జీఎస్టీఎన్, జీఎస్టీ కౌన్సిల్ ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి
- స్క్రాప్ రంగం, గుర్తింపు దొంగతనాలపై మంత్రుల బృందం ఏర్పాటు చేయాలని ప్రతిపాదన

జీఎస్టీ సంస్కరణలను స్వాగతిస్తూనే రాష్ట్రాల ఆదాయ ప్రయోజనాలను పరిరక్షించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు కేంద్రాన్ని కోరారు. 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆయన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. నిజాయితీగా పన్నులు చెల్లించే వారికి అనుసరణ ప్రక్రియను సరళీకరించడంతో పాటు, ఉద్దేశపూర్వకంగా పన్ను ఎగవేతకు పాల్పడే వారిపై జీరో టాలరెన్స్ విధానం కొనసాగాలని స్పష్టం చేశారు.

2లో▸

## డిజిటల్ మౌలిక సదుపాయాల్లో ఇండియా నెంబర్1: చంద్రబాబు

### డిజిటల్ మౌలిక సదుపాయాల్లో భారత్ నంబర్1 అని చంద్రబాబు.



- ఏపీలో డిజిటల్ హబ్‌లు, డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడి.
- ప్రతి 50 కి.మీ.కు పోర్టు/ఫిషింగ్ హార్బర్ ఉండేలా ప్రణాళికలు.
- పరిపాలనలో ఏఐ, సాంకేతికతతో సేవలు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు.

2లో▸

## తెలంగాణ నుండి నైరుతి రుతుపవనాల తిరోగమనం




తెలంగాణ నుంచి నైరుతి రుతుపవనాల తిరోగమనం మరింతగా కొనసాగింది. తాండూర్, వికారాబాద్, హైదరాబాద్, జనగామ, భూపాలపల్లి మీదుగా తిరోగమన రేఖ కొనసాగుతోంది.

2లో▸

## ఓటు చోరీ” ఆరోపణలకు అరెస్టులు సమాధానం కావు



బారికేడ్లతో ప్రజాస్వామ్యాన్ని బంధించలేరని, ప్రశ్నించే ఎంపీలను నిర్బంధించడం అధికార దర్పానికి నిదర్శనం అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సర్ పై ఢిల్లీలో లోక్ సభ లో ప్రతిపక్ష నేత కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ చేస్తున్న పోరాటం పై రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు.

గురువారం నాడిక్కడ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఓటు చోరీ పై ఘాటుగా స్పందించారు. రాహుల్ పోరాటాన్ని కేసులతో అణచివేయాలనుకోవడం కేంద్ర ప్రభుత్వ భ్రమ అని, ఢిల్లీలో రాహుల్--ప్రియాంక, ప్రతిపక్ష ఎంపీల నిర్బంధాన్ని మంత్రి ఉత్తమ్ ఖండించారు.

2లో▸

## గొడ్డలి పార్టీతో అభివృద్ధి కుంటుపడింది: హోం మంత్రి అనిత



గుంటూరు ఛానల్ పొడిగింపుతో 28 వేల ఎకరాలకు సాగునీరు.
మహిళా సంఘాలకు రూ.3 కోట్ల శ్రీనిధి రుణాలు, పనిముట్లు అందజేత.
పర్చూరులో రూ.75 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం.

2లో▸

## ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆందోళనలు కొనసాగిస్తాం: మహేశ్ గౌడ్



2లో▸

# సంపాదకీయం

## కృత్రిమ మేధకు దొంగతనమే మేత!

కృత్రిమ మేధస్సు (ఏఐ) గురించి వినగానే అదొక అద్భుతమైన మాయ అని, యంత్రాలు మనుషుల్లాగా ఆలోచిస్తున్నాయని మనం అనుకుంటాం. కానీ, 2026లో రచయిత క్రెయిగ్ వాన్‌పెల్ట్ రాసిన పరిశోధనా పత్రం... ఏఐ వెనుక ఉన్న భయంకరమైన వాస్తవాలను అత్యంత సరళంగా బట్టబయలు చేసింది. ఏఐ అనేది కేవలం మామూలు సాఫ్ట్‌వేర్ కాదు, సమాజంలోని మనుషుల సృజనాత్మకతను, శ్రమను కార్పొరేట్ లాభాల కోసం దోచుకునే క్రూరమైన పెట్టుబడిదారీ ఆయుధంగా ఈ పత్రం వివరిస్తుంది.
ఏఐ దానంతట అది కొత్తగా ఏదీ సృష్టించదు. వందల ఏళ్లుగా రచయితలు, కవులు, కళాకారులు తమ మెదళ్లను కరిగించి రాసిన కోట్లాది పుస్తకాలను, సమాచారాన్ని బడా కార్పొరేట్ కంపెనీలు ఉచితంగా దొంగిలించాయి. వాటితో తమ యంత్రాలకు శిక్షణ ఇచ్చాయి. అంటే, గత కాలపు మనుషుల శ్రమను లాభాలుగా మార్చుకుని, నేడు కథలు రాయాలనుకునే సజీవ రచయితల ఉపాధిని దెబ్బతీస్తున్నాయి.
ఏఐకి ప్రాణం, ఆత్మ, ఆలోచన ఉండవు. హాలీవుడ్ సినిమాల్లోని జాంబీల్లాగా ఇవి కేవలం బతికున్న మనుషుల సమాచారాన్ని మింగేసి బతుకుతాయి. అందుకే రచయిత క్రెయిగ్ వాన్‌పెల్ట్ వీటిని 'సైబర్ జాంబీలు' అన్నాడు. మనిషి కథ రాస్తే అందులో అతని జీవితం, ఆకలి, బాధ ఉంటాయి. కానీ ఏఐ... ఇంటర్నెట్‌లోని పదాలను లెక్కలు వేసుకుని కలుపుతుంది తప్ప, అందులో ఆత్మ ఉండదు. ఈ యంత్రాలు నడిచే పెద్ద డేటా సెంటర్లను, మనుషుల ఆలోచనలను పాతరేసిన 'శ్మశాన వాటికలు' (నెక్రోపాలిస్)గా రచయిత అభివర్ణించాడు. ఏఐ వల్ల సమాజంలో రచయితలు, డిజైనర్లు, కోడర్లు వంటి 'జ్ఞాన కార్మికులు' (కాగ్నిటేరియట్) తీవ్రంగా నష్టపోతున్నారు. 'యంత్రం ఉచితంగా కథలు రాస్తుంటే మీకెందుకు డబ్బులు ఇవ్వాలి?' అని కార్పొరేట్లు ప్రశ్నిస్తున్నారు. ఏఐ వల్ల కళలు సామాన్యులకు కూడా చేరువవుతున్నాయని, ఇది ప్రజాస్వామ్యీకరణ అని టెక్ కంపెనీలు చెప్పేమాట పచ్చి అబద్ధం. ఇది కేవలం వారి గుత్తాధిపత్యం. సమాజాన్ని ప్రశ్నించే విషయాలను ఈ యంత్రాలు సెన్సార్ చేస్తాయి. మన స్వేచ్ఛను లాగేసుకుని యంత్రాల చేతిలో పెట్టడమే దీని అసలు లక్ష్యం.
కళ అనేది సమాజంలోని మానవ సంబంధాలు, పోరాటాల నుంచి వస్తుంది. రచయిత క్రైమ్ థ్రిల్లర్ రాసినా, రాజకీయ కథ రాసినా అందులో అతని సామాజిక స్పృహ ఉంటుంది. కానీ ఏఐకి ఇలాంటి అనుభవాలు శూన్యం. సమాజం, జీవితం తెలియని యంత్రం పుట్టించే కళకు ఆత్మ ఉండదు. కార్పొరేట్ సంస్థలు ఏఐని సృష్టికర్తగా ప్రచారం చేస్తున్నాయి. కానీ అది సృష్టికర్త కాదు, ఇతరుల శ్రమను కాపీ కొట్టే అనుకర్త మాత్రమే. పెట్టుబడిదారీ వ్యవస్థలో లాభమే ముఖ్యం. కళను కూడా వస్తువులానే చూస్తారు. నిజమైన రచయితకు పారితోషికం ఇవ్వాలి, అతని హక్కులను గౌరవించాలి. అదే ఏఐ అయితే ఉచితంగా, వేగంగా వేలాది పేజీలు రాసిస్తుంది. యంత్రం జీతం అడగదు, సమ్మె చేయదు కాబట్టే కార్పొరేట్లు దీనిని ప్రజలపై రుద్దుతున్నారు.
చేనేత కార్మికులు యంత్రాల వల్ల ఎలా కూలీలుగా మారారో, ఇప్పుడు రచయితలను కూడా 'ప్రాంప్ట్ ఇంజినీర్లు'గా మారుస్తున్నారు. యంత్రం రాసిన చెత్తను సరిదిద్దే ప్రూఫ్ రీడర్ స్థాయికి అతడిని దిగజార్చుతున్నారు. మనిషికీ మనిషికీ మధ్య ఉండే భావోద్వేగ బంధమే కళకు మూలం. ఆ బంధం లేని ఏఐ రచనలు కేవలం ఖాళీ డబ్బాల్లాంటివి. ఇది టెక్నాలజీకి వ్యతిరేకం కాదు. సమాజం మొత్తానికి ఉపయోగపడేలా ఉంటే టెక్నాలజీ మంచిదే. కానీ కొద్దిమంది లాభాల కోసం మనుషుల శ్రమను దోచుకోవడమే అసలు సమస్య. మనిషిలోని సృజనాత్మకతను, ఆలోచనను ఏ యంత్రమూ ఎప్పటికీ భర్తీ చేయలేదు.
కార్ల్‌మార్క్స్ చెప్పిన 'పరాయీకరణ' సిద్ధాంతాన్ని ఫ్రాంక్ షిల్లింగర్ 2025లో రాసిన వ్యాసం ద్వారా ఏఐకి అద్భుతంగా అన్వయించాడు. ఫ్యాక్టరీలో కార్మికుడు తాను తయారు చేసిన వస్తువుపై హక్కు కోల్పోవడాన్ని మొదటి దశ పరాయీకరణ అంటారు. ఇది భౌతికమైనది. కానీ ఇప్పుడు ఏఐ ద్వారా జరుగుతున్నది రెండో దశ పరాయీకరణ. ఇది మానసికమైనది. సృజనాత్మక రంగాల్లో మనిషి తన సొంత ఆలోచనలకు, రచనలకు తానే పరాయివాడిగా మారిపోతున్నాడు. ఉదాహరణకు, ఒక యువ రచయిత డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో పెద్ద ధారావాహిక రాయాలనుకున్నాడు.

## జీఎస్టీ సంస్కరణల్లో రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడాలి

మొదటి పేజీ తరువాయి

జీఎస్టీ అమలుకు పునాది పరస్పర విశ్వాసమేనని భట్టి పేర్కొన్నారు. ఉమ్మడి జాతీయ మార్కెట్ ఏర్పాటుతో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందన్న నమ్మకంతో రాష్ట్రాలు తమ స్వతంత్ర పన్ను విధించే అధికారంలో గణనీయమైన భాగాన్ని వదులుకున్నాయని గుర్తుచేశారు. కేంద్రం, రాష్ట్రాలు భాగస్వాములుగా పనిచేయడం, రాష్ట్రాల ఆదాయాన్ని కాపాడటం, కీలక మార్పులను సంప్రదింపులు, ఏకాభిప్రాయంతో చేపట్టడం ఈ వ్యవస్థకు మూల సూత్రాలని అన్నారు.

### తెలంగాణపై జీఎస్టీ ప్రభావం

తెలంగాణ సొంత పన్ను ఆదాయంలో జీఎస్టీ వాటా సుమారు 35 శాతం ఉందని భట్టి తెలిపారు. ఈ ఆదాయంతోనే రాష్ట్రంలో పాఠశాలలు, ఆసుపత్రులు, సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలకు నిధులు సమకూరుతున్నాయని చెప్పారు. జీఎస్టీ ఆదాయంలో తగ్గుదల కేవలం లెక్కల అంశం కాదని, ప్రజలకు సేవలు అందించే రాష్ట్ర సామర్థ్యంపై నేరుగా ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.
మోటార్ వాహనాలు, క్యాపిటల్ గూడ్స్, ఇన్‌పుట్ సర్వీసుల రీఫండ్‌లకు సంబంధించిన మార్పులు చేపట్టే ముందు వాటి పూర్తి ఆర్థిక ప్రభావాన్ని రాష్ట్రాలకు వివరించాలని కోరారు. మోటార్ వాహనాల విషయంలో కేంద్రం అందించిన అంచనాల ప్రకారం తెలంగాణకు ఏడాదికి సుమారు రూ.800 కోట్ల ఆదాయ ప్రభావం ఉంటుందని, రాష్ట్ర సొంత అంచనాల ప్రకారం ఈ నష్టం అంతకంటే రెట్టింపు కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపారు.
తగిన సందర్భాల్లో ఆటోమేటిక్ జీఎస్టీ రిజిస్ట్రేషన్, రిజిస్ట్రేషన్ మార్పులు, రద్దు దరఖాస్తుల ఆటోమేటిక్ ప్రాసెసింగ్‌కు భట్టి మద్దతు తెలిపారు. రిస్క్ లేని కేసుల్లో ఆటోమేటిక్‌గా రీఫండ్‌లు మంజూరు చేయడం ద్వారా నిజాయితీగల పన్నుదారులకు త్వరగా ప్రయోజనం అందుతుందని అన్నారు. అదే సమయంలో అధిక రిస్క్ ఉన్న కేసులపై పన్ను అధికారులు మరింత దృష్టి సారించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. పెనాల్టీలను హేతుబద్ధీకరించడం, రహదారులపై సరుకుల వాహనాలను యాదృచ్ఛికంగా నిలిపివేయడాన్ని తగ్గించడం వంటి చర్యలను స్వాగతించారు. జీఎస్టీ రిటర్నుల్లో అవసరమైన మార్పులు చేసి పన్ను వివరాల్లో తేడాలను తగ్గించాలని, నిజాయితీగల పన్నుదారులకు అనవసర నోటీసులు జారీ కాకుండా చూడాలని సూచించారు. జీఎస్టీ అమలులో స్పష్టత, ఏకరూపత కోసం తగిన సర్క్యులర్లు, వివరణలు జారీ చేయాలని కోరారు.

### నకిలీ రిజిస్ట్రేషన్లపై ఉక్కుపాదం

పన్నుదారులకు అనుకూలమైన విధానాలను అమలు చేయడంతో పాటు జీఎస్టీ మోసాలు, నకిలీ రిజిస్ట్రేషన్లు, గుర్తింపు వివరాల దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని భట్టి డిమాండ్ చేశారు. వృద్ధులు, గృహిణులు, రోజువారీ కూలీలు, ఇతర అమాయకుల ఆధార్, పాన్ వివరాలను దుర్వినియోగం చేసి మోసపూరిత జీఎస్టీ రిజిస్ట్రేషన్లు సృష్టిస్తున్న ఘటనలను ప్రస్తావించారు.
నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించడం, అక్రమంగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందడం లేదా ఇతరులకు బదిలీ చేయడం వంటి కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తులు, వ్యవస్థీకృత ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విధానాలను సరళీకరించడం పేరుతో వ్యవస్థీకృత పన్ను ఎగవేతపై అమలు చర్యలు బలహీనపడకూడదని స్పష్టం చేశారు.

### స్క్రాప్ రంగంపై ప్రత్యేక దృష్టి

దేశవ్యాప్తంగా స్క్రాప్ రంగంలో జరుగుతున్న పన్ను ఎగవేతను భట్టి ప్రస్తావించారు. అసంఘటిత, నగదు ఆధారిత వ్యవస్థ కారణంగా నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించడం, నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ బదిలీ చేయడం జరుగుతోందని చెప్పారు. అదే సమయంలో ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న చెత్త సేకరించే కార్మికులు, చిన్న స్థాయి సేకరణదారుల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.
స్క్రాప్ రంగం, గుర్తింపు దొంగతనం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి, పేద ప్రజల ప్రయోజనాలను కాపాడే కార్యాచరణను రూపొందించేందుకు జీఎస్టీ కౌన్సిల్

## ఓటు చోరీ" ఆరోపణలకు అరెస్టులు సమాధానం కావు

మొదటి పేజీ తరువాయి

జంతర్ మంతర్‌కు వెళ్తున్న ఎంపీల బస్సులను అడ్డుకోవడంపై ఉత్తమ్ మండిపడ్డారు. కేసుల సంఖ్య పెంచితే ప్రజల ప్రశ్నలు తగ్గిపోతాయనుకోవడం పాలకుల పొరపాటు అని విమర్శించారు. రాహుల్ నాయకత్వం దేశవ్యాప్త ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటానికి స్ఫూర్తి అని ఉత్తమ్ అన్నారు. ఓటు హక్కు కోసం నిలిచిన రాహుల్--ప్రియాంకల ధైర్యానికి ఉత్తమ్ అభినందనలు తెలిపారు.
ఓటర్ల జాబితాల సవరణపై అభ్యంతరాలకు ఎన్నికల సంఘం ఆధారాలతో జవాబివ్వాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. ఆరోపణలను ఖండించడంతో సరిపెట్టకుండా ప్రజల సందేహాలను నివృత్తి చేయాలని, ఓటర్ల పేర్ల చేర్పులు, తొలగింపులకు అనుసరించిన ప్రమాణాలను బహిర్గతం చేయాలని
ఉత్తమ్ అన్నారు.
"ఓటు చోరీ" ఆరోపణలపై స్వతంత్ర, నిష్పక్షపాత పరిశీలన జరగాలని, ఏ పార్టీ ఒత్తిడికీ లోనుకాకుండా ఎన్నికల సంఘం పారదర్శకంగా పనిచేయాలన్నారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న ప్రతిపక్ష డిమాండ్‌కు సంపూర్ణ మద్దతు
తెలుపుతున్నట్లు మంత్రి చెప్పారు. ప్రతి అర్హుడి ఓటు హక్కును కాపాడాలని.. ప్రతి అభ్యంతరానికి సమాధానమివ్వాలని ఆయన అన్నారు. ప్రశ్నించే గొంతుపై ఉక్కుపాదం మోపే వైఖరిని దేశం అంగీకరించదని మంత్రి ఉత్తమ్ చెప్పారు.

## తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా భారీ స్థాయిలో రక్షా ఎక్స్‌పో



### డిసెంబర్ 9న ఎయిర్ షో నిర్వహణ
### రక్షణ, ఏరోస్పేస్ రంగాల అభివృద్ధికి ఎక్స్‌పో దోహదం
### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026లో భాగంగా డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో భారీ స్థాయిలో రక్షా ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. డిసెంబర్ 9న ఎయిర్ షోను కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.
రక్షా ఎక్స్‌పో నిర్వహణ ఏర్పాట్లపై డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం సీఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్స్‌పోకు సంబంధించిన ఏర్పాట్లు, పాల్గొనే సంస్థలు, ప్రచార కార్యక్రమాలు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.
రక్షణ, వైమానిక రంగాలకు సంబంధించిన సుమారు 30 శాతం పరిశ్రమలు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయని సీఎస్ తెలిపారు. తెలంగాణలో డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాల అభివృద్ధికి, పెట్టుబడులను ఆకర్షించేందుకు రక్షా ఎక్స్‌పో కీలక వేదికగా నిలుస్తుందని అన్నారు.

### జాతీయ, అంతర్జాతీయ సంస్థలకు ఆహ్వానం

తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026లో భాగంగా నిర్వహిస్తున్న ఈ రక్షా ఎక్స్‌పోలో పాల్గొనేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోని ప్రముఖ రక్షణ, ఆయుధ తయారీ సంస్థలు, డిఫెన్స్, ఏరోస్పేస్ కంపెనీలను ఆహ్వానిస్తున్నట్లు సీఎస్ తెలిపారు. ఎక్స్‌పోకు విస్తృత ప్రచారం కల్పించేందుకు అక్టోబర్ 24న హైదరాబాద్‌లో, అక్టోబర్ 29న న్యూఢిల్లీలో రోడ్ షోలను నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల విస్తరణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని సీఎస్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో ఎయిర్‌ఫీల్డ్ స్ట్రిప్ ఏర్పాటు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.

### డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాలకు ప్రత్యేక వేదిక

ఫిక్కీ, అసోచామ్, ఎస్ఐడీఎం, ఎంఎస్ఎంఈలతో పాటు డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలను ఎక్స్‌పోలో భాగస్వామ్యం చేయాలని సీఎస్ సూచించారు. హెచ్ఏఎల్, బీఈఎల్, బీడీఎల్ తదితర ప్రముఖ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించడంతో పాటు మార్కెటింగ్, బయ్యర్--సెల్లర్ సమావేశాలు, బిజినెస్ ఇంటరాక్షన్స్, ఎంఓయూలు, స్టార్టప్‌లకు అవకాశాలు, సెమినార్లు తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా పోలీసు, పారామిలటరీ దళాల ఆధునికీకరణ కొనసాగుతున్న నేపథ్యంలో అన్ని రాష్ట్రాల డీజీపీలను కూడా రక్షా ఎక్స్‌పోకు ఆహ్వానించాలని సీఎస్ సూచించారు.
విస్తృత ప్రచారానికి ఆదేశాలు
రక్షా ఎక్స్‌పోపై
హైదరాబాద్‌లోని ప్రముఖ ప్రాంతాల్లో స్టాండీలను ఏర్పాటు చేయాలని, షార్ట్ ఫిలిమ్స్ ప్రదర్శించాలని సీఎస్ సూచించారు. బ్రోచర్లు, సోషల్ మీడియా తదితర మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.
ఈ సమావేశంలో హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, పంచాయతీరాజ్, సెర్ప్ కమిషనర్ దివ్య, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నదుల పునరుజ్జీవనానికి సమగ్ర చర్యలు

### విద్యలో జల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి: సీఆర్ పాటిల్
### రూ.43,266 కోట్లతో నమామి గంగే కింద 527 ప్రాజెక్టులకు ఆమోదం

నదుల పునరుజ్జీవనానికి మురుగునీటి శుద్ధి, భూగర్భజలాల నిర్వహణ, పర్యావరణ పునరుద్ధరణను సమన్వయం చేస్తూ సమగ్ర చర్యలు చేపట్టాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ సూచించారు. న్యూఢిల్లీలో ఆయన అధ్యక్షతన జరిగిన గంగా పునరుజ్జీవన సాధికార కార్యదళం 20వ సమావేశంలో నమామి గంగే కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. కొనసాగుతున్న ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయాలని, వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలు, భూ లభ్యత తదితర అంశాల్లో పెండింగ్ సమస్యలను వేగంగా పరిష్కరించాలని సంబంధిత సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించారు.
జల అంశాలను విద్యతో అనుసంధానించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా పాఠశాలల్లో నీటి సంరక్షణకు సంబంధించిన పాఠ్యాంశాలు ప్రవేశపెట్టాలని మంత్రి పేర్కొన్నారు. ఇంజినీరింగ్, సాంకేతిక విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేక జల అంశాలు, ఉన్నత విద్యాసంస్థల్లో జల నిర్వహణ, పాలనపై కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.
368 ప్రాజెక్టులు పూర్తి
నమామి గంగే కార్యక్రమం కింద 2026 ఆగస్టు నాటికి రూ.43,266 కోట్ల వ్యయంతో 527 ప్రాజెక్టులకు ఆమోదం లభించగా, వాటిలో 368 పూర్తయినట్లు సమావేశంలో వెల్లడించారు. మురుగునీటి మౌలిక వసతుల విభాగంలో రోజుకు 6,603 మిలియన్ లీటర్ల శుద్ధి సామర్థ్యం, 5,245 కిలోమీటర్ల మురుగునీటి పారుదల వ్యవస్థ లక్ష్యంగా 219 ప్రాజెక్టులకు ఆమోదం ఇచ్చారు. వీటిలో 147 ప్రాజెక్టులు పూర్తికావడంతో రోజుకు 4,339 మిలియన్ లీటర్ల శుద్ధి సామర్థ్యం అందుబాటులోకి వచ్చింది. 4,615 కిలోమీటర్ల మురుగునీటి పారుదల వ్యవస్థ నిర్మాణం పూర్తయింది.బరౌనీ మురుగునీటి శుద్ధి కేంద్రం సవరించిన ప్రాజెక్టు నివేదికను పరిశీలన కోసం ఐఐటీ--బీహెచ్‌యూకు

## సుపరిపాలనకు మొబైల్ ఫోన్ ఓ మంచి టూల్: మోదీ

మొదటి పేజీ తరువాయి

డిజిటల్ సేవలు అందుబాటు ధరల్లో ఉండాలని, చిట్టచివరి వ్యక్తి వరకు చేరాలని అన్నారు. సైబర్ మోసాల ను అరికట్టేందుకు నూతన సాంకేతిక పరిష్కారాలు అవసరమని అభిప్రాయపడ్డారు. డీప్‌ఫేక్(ఎవవజూట్ఖుఎవ)ల మూలాలను గుర్తించే వ్యవస్థలు, తదితర సాంకేతికపరమైన సమస్యలపై ప్రపంచ దేశాలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

## డిజిటల్ మౌలిక సదుపాయాల్లో ఇండియా నెంబర్1: చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

దిల్లీ: డిజిటల్ మౌలిక సదుపాయాల విషయంలో ఇండియా నంబర్ 1గా ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. భారత్‌లో సింగిల్ పవర్ గ్రిడ్ ఉందని, అమెరికాలో కూడా ఇది లేదని చెప్పారు. రోడ్ గ్రిడ్ విషయంలో భారత్ రెండో స్థానంలో ఉన్నట్లు చెప్పారు. విశాఖలో నవంబర్‌లో నిర్వహించే పెట్టుబడుల సదస్సుకు సన్నాహకంగా దిల్లీలో ఏర్పాటు చేసిన సీఐఐ సదస్సులో చంద్రబాబు మాట్లాడారు. సీఐఐతో మూడు దశాబ్దాలుగా అనుబంధం ఉన్నట్లు గుర్తు చేశారు. "1895లో సీఐఐ కోల్‌కతాలో ఏర్పాటైంది. 1996 ప్రాంతంలో నేను సీఐఐని ప్రమోట్ చేశాను. 1990లో వచ్చిన ఐటీ విప్లవాన్ని నేను అందిపుచ్చుకున్నా. ఐటీ కేంద్రంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేశా. నేను తీసుకున్న చర్యల వల్ల ఇప్పుడు తెలంగాణ తలసరి ఆదాయంలో నంబర్1గా ఉంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మారాం. పెట్టుబడిదారులు అనుమతి కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేదు. అంతా ఆన్‌లైన్‌లోనే. రియల్ టైమ్‌లో పరిష్కరించేలా చర్యలు చేపట్టాం. ఏపీలో డిజిటల్ హబ్, డేటా సెంటర్లు వస్తున్నాయి. ఇటీవలే రాయలసీమ ప్రాంతంలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టును ప్రారంభించాం.
రాష్ట్రంలో సముద్ర తీరాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రచిస్తున్నాం. ప్రతి 50 కి.మీ.కు పోర్టు లేదా ఫిషింగ్ హార్బర్ ఉండేలా ప్లాన్ చేస్తున్నాం. పోర్టుల అనుసంధానానికి, కారిడార్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేశాం. పుట్టపర్తిలో డిఫెన్స్, ఏరోస్పేస్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశాం. అతిపెద్ద రక్షణ తయారీ కేంద్రానికి రాష్ట్రంలో అడుగులు పడ్డాయి. గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా రంగాల్లో రాష్ట్రం నుంచి ఎగుమతులకు చర్యలు చేపట్టాం.
పరిపాలనలో సాంకేతికత, కృత్రిమ మేధస్సు జోడించి సేవలు వేగవంతం చేశాం. రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీతో సేవల వేగవంతానికి చర్యలు చేపట్టాం. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్ ప్రారంభానికి చర్యలు ప్రారంభించాం. అమరావతిని గ్లోబల్ టెక్ కేంద్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తున్నాం" అని తెలిపారు.

## గొడ్డలి పార్టీతో అభివృద్ధి కుంటుపడింది: హోం మంత్రి అనిత

మొదటి పేజీ తరువాయి

పర్చూరు: బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలో హోం మంత్రి అనిత పర్యటించారు. రూ.75 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలిసి పాల్గొన్నారు. మహిళా సహాయక బృందాలకు రూ.3 కోట్ల విలువైన శ్రీనిధి రుణాలు, పనిముట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గుంటూరు ఛానల్‌ను పర్చూరుకు పొడిగించడం శుభపరిణామమని చెప్పారు. 28 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు.
రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నా.. సంక్షేమ పథకాలపై సీఎం చంద్రబాబు దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ఆయన నిరంతరం శ్రమిస్తున్నట్లు చెప్పారు. " గొడ్డలి పార్టీ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డీఎస్సీ ద్వారా 16వేల ఉద్యోగాలు భర్తీ చేసింది. రాష్ట్రంలో గంజాయిని తరిమి కొట్టాలని ఈగల్ టీమ్‌లను ఏర్పాటు చేశాం. మహిళల భద్రతకు కృషి చేస్తున్నాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం" అని అనిత పిలుపునిచ్చారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆందోళనలు కొనసాగిస్తాం: మహేశ్ గౌడ్

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: నగరంలో ఓటు హక్కు పరిరక్షణ కోసం తెలంగాణ కాంగ్రెస్, ఇండియా కూటమి చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ.. సేవ్ డెమోక్రసీ పేరుతో కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు చలో లోక్‌భవన్ చేపట్టారు. నెక్లెస్ రోడ్డు ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లోక్‌భవన్ వరకు భారీ ర్యాలీగా బయలుదేరిన నేతలను లోక్ భవన్ సమీపంలో పోలీసులు అడ్డుకున్నారు. బారికేడ్లు దాటి ముందుకు వెళ్లేందుకు నేతలు ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీపీఐ, సీపీఎం, తెలంగాణ జన సమితి నాయకులను అదుపులోకి తీసుకొని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ (మీుఖ్ష్ర్‌వంఖ్త ఖబమీుతీ +శీబఎ) మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వైఖరిని తప్పుబట్టారు. ఇంత పెద్ద ఎత్తున వ్యతిరేకత వస్తున్నా కూడా పదవిలో కొనసాగడం సరికాదన్నారు. తక్షణమే ఆయన స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణపై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేసే పరిస్థితుల్లో కేంద్ర ఎన్నికల సంఘం లేదని ఆరోపించారు. ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని.. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి విశ్వాసం కలిగేలా పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. దిల్లీలో రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ సహా ఇండియా కూటమి నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటనను రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఖండించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## తెలంగాణ నుండి నైరుతి రుతుపవనాల తిరోగమనం

మొదటి పేజీ తరువాయి

మహారాష్ట్రలోని మిగిలిన ప్రాంతాలు; గోవా, కర్ణాటక, తెలంగాణ, ఒడిశాలోని కొన్ని ప్రాంతాలు; జార్ఖండ్ & ఛత్తీస్‌గఢ్‌లోని మరికొన్ని ప్రాంతాల నుండి నైరుతి రుతుపవనాలు మరింతగా తిరోగమించాయి.
నైరుతి రుతుపవనాల తిరోగమణ రేఖ ఇప్పుడు 27.5°N/86.5°E, సుపాల్, రాంచీ, సుందర్‌గఢ్, బర్గఢ్, బిజాపూర్, హైదరాబాద్, బెళగావి, పంజిమ్ 15°N/72°E గుండా వెళుతోంది.
తెలంగాణలో ఈ తిరోగమణ రేఖ తాండూర్, వికారాబాద్, హైదరాబాద్, జనగాం మరియు భూపాలపల్లి గుండా వెళుతోంది. రాబోయే 3-4 రోజుల్లో తూర్పు భారతదేశం మరియు ఉత్తర ద్వీపకల్పంలోని మరికొన్ని ప్రాంతాల నుండి, అలాగే ఈశాన్య భారతదేశంలోని అనేక ప్రాంతాల నుండి నైరుతి రుతుపవనాలు మరింతగా తిరోగమించడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయి

# కర్షకుని కనులలో కన్నీళ్లు.. కరెంట్ కష్టాలు..

-కనీసం 15 రోజులైనా రైతులకు 12 గంటల విద్యుత్ ఇవ్వాలి
-మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి



ఈకాలం
విద్యుత్ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంటలను కాపాడేందుకు కనీసం మరో 15 రోజుల పాటు రోజుకు 12 గంటల నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు సాగునీరు, విద్యుత్ అందించాలని కోరుతూ నిజాంపేట మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మాదేవేందర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు తిరుపతిరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం పంటలు కీలకమైన పొట్ట దశలో ఉన్నాయని, ఈ సమయంలో సాగునీరు అందితేనే పంటలు చేతికొచ్చి రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. మరో 15 రోజుల పాటు రోజుకు 12 గంటల విద్యుత్ సరఫరా చేస్తే రైతులు పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రైతులకు 24 గంటల విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిందని, అయితే ప్రస్తుతం ఆరు నుంచి ఏడు గంటల విద్యుత్ కూడా సక్రమంగా అందడం లేదని ఆమె ఆరోపించారు. లో-వోల్టేజీ, ట్రిప్పింగ్ సమస్యల కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్, సాగునీటి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కనీసం 15 రోజుల పాటు 12 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే రైతుల పక్షాన మరిన్ని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. 4

# నూతన క్రిమినల్ చట్టాలపై 7వ బెటాలియన్ టీజీఎస్పీలో శిక్షణ..



ఈకాలం
నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని 7వ బెటాలియన్ టీజీఎస్పీలో సి డ హెచ్క్యూ కంపెనీ సిబ్బందికి నూతన క్రిమినల్ చట్టాలపై గురువారం ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నుంచి వచ్చిన కే. వెంకట్రావు, ఎస్ఐపీ, సీటీసీ, సయ్యద్ ముజాహిద్, మాచందర్ రెడ్డి, ఎస్ఐపీ, సీబీఎస్‌లు నూతన క్రిమినల్ చట్టాల్లో వచ్చిన ముఖ్యమైన మార్పులు, వాటి అమలులో పోలీసు సిబ్బంది పాటించాల్సిన విధానాలు, కేసుల దర్యాప్తు, న్యాయపరమైన ప్రక్రియలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. నూతన క్రిమినల్ చట్టాలపై ప్రతి పోలీసు సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండటం ద్వారా చట్టాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని శిక్షకులు వివరించారు. విధి నిర్వహణలో చట్టపరమైన నిబంధనలు, దర్యాప్తు ప్రక్రియలు, కేసుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కమాండెంట్ బి. సీతారాం, అసిస్టెంట్ కమాండెంట్లు డి. శ్రీనివాసరావు, నరసింహస్వామితో పాటు సి డ హెచ్క్యూ కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

# అన్ని కులాల్లోని నిరుపేదలకు రిజర్వేషన్లు కల్పించాలి..

-ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్ల సాధనే లక్ష్యం నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి
-ఈ నెల 24 నుంచి రాష్ట్రంలో 'ఆర్థిక రిజర్వేషన్ సాధన రథయాత్ర'
-కామారెడ్డిలో 24న బహిరంగ సభ.. పరకాలలో 26న భారీ సభ



ఈకాలం
కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల్లోని నిరుపేదలకు ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని 'ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల సాధన కమిటీ' నాయకులు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా అట్టడుగు వర్గాల్లోని అనేక మంది నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు, రిజర్వేషన్ల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందడం లేదని పేర్కొన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర స్థాయి కమిటీ ప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు మాట్లాడారు. 24 నుంచి ఆర్థిక రిజర్వేషన్ సాధన రథయాత్ర ప్రవీణ్ అరోరా నేతృత్వంలో ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద ప్రారంభమైన 20 వేల కిలోమీటర్ల సుదీర్ఘ రథయాత్ర ఈ నెల 24న నాగ్‌పూర్ మీదుగా ఆదిలాబాద్ జిల్లాలో తెలంగాణలోకి ప్రవేశించనుందని రాష్ట్ర కోఆర్డినేటర్ ఏనుగు సంతోష్ రెడ్డి తెలిపారు. నిర్మల్‌లో కార్నర్ మీటింగ్ అనంతరం కామారెడ్డిలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం నిజామాబాద్, రామాయంపేట, తూప్రాన్ తదితర ప్రాంతాల్లో కార్నర్ మీటింగ్‌లు నిర్వహించి హైదరాబాద్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఈ నెల 25న హైదరాబాద్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం 26న జనగామ, వరంగల్ మీదుగా పరకాలకు చేరుకుని వేలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రత్యేక రాజ్యాంగ కమిషన్ ఏర్పాటు చేయాలి రాష్ట్ర కోఆర్డినేటర్ నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రాజ్యాంగ కమిషన్‌ను ఏర్పాటు చేసి, చట్టబద్ధంగా ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అట్టడుగు స్థాయిలో ఉన్న ప్రతి నిరుపేదకు సంక్షేమ ఫలాలు అందే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రథయాత్రకు, ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల ఉద్యమానికి ప్రజలు, అన్ని వర్గాల నాయకులు మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో పైళ్ల హరినాథ్ రెడ్డి, ఏనుగు సంతోష్ రెడ్డి, నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి, బుట్టం గారి మాధవ రెడ్డితో పాటు వివిధ కుల సంఘాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# మూడు రోజుల క్రితం దాడి చేసింది చిరుత..



ఈకాలం
సిరికొండ మండల కేంద్రంలోని గుడిలింగాపూర్ వెస్ట్ బీట్, తూంపల్లి సెక్షన్ పరిధిలోని కంపార్ట్‌మెంట్ నంబర్ 487 అటవీ ప్రాంతంలో మూడు రోజుల క్రితం వ్యక్తిపై దాడి చేసిన జంతువు చిరుతేనని అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. దుప్పాతండాకు చెందిన భూక్య చెన్న (తండ్రి నేమ్యా) మేకలు మేపేందుకు అటవీ ప్రాంతానికి వెళ్లిన సమయంలో చిరుత దాడి చేయడంతో ఎడమ చేతి పైభాగం, కుడి కాలి తొడపై గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి చెన్నను సిరికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకున్న చెన్నను వైద్యులు డిశ్చార్జ్ చేయడంతో ప్రస్తుతం ఇంటి వద్ద ఉన్నట్లు సిరికొండ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కే. నర్సింగరావు తెలిపారు. అటవీ ప్రాంతాల్లో చిరుత సంచారం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఆర్ఓ నర్సింగరావు సూచించారు. వన్యప్రాణుల సంచారం కనిపించినా, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైనా వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

# కేంద్ర ప్రభుత్వం ఓటు హక్కును హరిస్తే ప్రజల గుణపాఠం తప్పదు



ఈకాలం
అఖిలపక్ష ర్యాలీలో బొమ్మెర శ్రీనివాస్ మాట్లాడారు ఓట్ల గల్లంతకు నిరసనగా ఇండియా కూటమి భారీ ర్యాలీ కొత్తగూడెం పట్టణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగం ద్వారా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కులమతాలకు అతీతంగా పోరాడి ఓటు హక్కును ప్రతి ఒక్కరికి కల్పించారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్ తోడై ఓట్ల గల్లంతకు పాల్పడితే ప్రజల తిరుగుబాటుతో ఎంతటి ప్రభుత్వానైనా కూల దోయటం ఖాయమని అన్నారు. ఎన్నికల కమిషన్ జ్ఞానేశ్ కుమార్ కుట్ర పూరితంగా తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. బీజేపి పాలిత రాష్ట్రాలు హర్యానా, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలలో ఇంట్లో మరుగుదొడ్డి లేదనే కారణం చూపి ఎన్నికల్లో ఓటు వేసి హక్కు, ఎన్నికల్లో పోటీ చేసే హక్కు లేకుండా నిబంధనలు విధించారని విమర్శించారు. ఓటు హక్కు ప్రతి ఒక్కరి స్వతంత్ర హక్కు అని అన్నారు. ఇండియా కూటమి అఖిలపక్షం కమిటీ చేపట్టే పోరాటానికి షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి జేఏసీ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.కె షాబీర్ పాషా అధ్యక్షతన జరిగింది. పాల్గొన్న నాయకులు కాంగ్రెస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగ సీతారాములు, సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు గవిని నాగేశ్వరరావు, తెలంగాణ జన సమితి జిల్లా నాయకులు దేవదానం, తదితరులు పాల్గొన్నారు.

# మురం శెట్టి రాములు జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు..



ఈకాలం
గో ప్రేమికుడు, గణేష్ దీక్షకారకుడు, నిత్యాన్వేషి, సాంఘిక, సామాజిక, ఆధ్యాత్మిక సేవకుడు, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్, మాజీ టీటీడీ బోర్డు సభ్యుడు మురం శెట్టి రాములు 70వ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు, వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 20 మంది పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా రక్తదానం ఎంతో గొప్పదని అన్నారు. మురం శెట్టి రాములు జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మురం శెట్టి రాములను ఆదర్శంగా తీసుకొని గోసేవతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# ఎమ్మెల్యే భూపతి రెడ్డిని కలిసిన నూతన రూరల్ సీఐ..



ఈకాలం
నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీహెచ్. శ్రీనివాస్ గురువారం రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి పరిచయం చేసుకున్నారు. అనంతరం నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీఐకి సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నూతన బాధ్యతల్లో సీఐ శ్రీనివాస్ విజయవంతంగా పనిచేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

# తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రహారీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

ఈకాలం



ఆత్మకూరు మండలం పెద్దాపురం హైస్కూల్ నందు తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రహరీ గోడ నిర్మాణ పనులకు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ వ్యవస్థను ప్రారంభించిందని తెలిపారు.విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు.తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ద్వారా పేద విద్యార్థులకు కూడా కార్పొరేట్ పాఠశాలలకు దీటైన విద్యా అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు.

# పరకాల పట్టణాన్ని ఒక మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నాం

- పరకాల పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలి
- పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి

ఈకాలం



గురువారం పరకాల పట్టణ కేంద్రంలోని అన్ని వార్డులలో మున్సిపల్ అధికారులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పర్యటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరకాల పట్టణాన్ని ఒక మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకమైన డిపిఆర్ వ్యవస్థతో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి వసతులతో పాటు ప్రజలకు అవసరమైన ఇతర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు.పరకాలకు పూర్వ వైభవం తీసుకురావడంలో ప్రజలు సహకరించాలని అన్నారు.గత బిఆర్ఎస్ పాలకుల మోసపూరిత మాటలతో పరకాల పట్టణం వెనుకబడిందన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- ఆర్టీసీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

ఈకాలం



పరకాల ఆర్టీసీ డిపో యందు టీజీఎస్ఆర్టీసీ ఎన్నికల సందర్భంగా టి డబ్ల్యూ యూ, ఎస్ డబ్ల్యూ ఎఫ్, ఐ ఎన్ టి యూ సి కూటమి అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. రీజియన్ క్లాస్ సీరియల్ నెంబర్ 6, స్టేట్ క్లాస్ సీరియల్ నెంబర్ 3 బాణం గుర్తుపై ఓటు వేసి ఐక్య కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆర్టీసీ కార్మికులను కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తుందని అన్నారు.ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ఐక్య కూటమి అభ్యర్థులు కృషి చేస్తారని తెలిపారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు ఆర్టీసీ కార్మికుల ఎన్నికలను అడ్డుకుని, వారి సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు ప్రజాస్వామ్య హక్కులు కల్పిస్తూ, వారి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు సాగుతోందని అన్నారు.ఐక్య కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

# ఓట్లు తొలగించి, దేశ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న కేంద్రంలోని బి.జె.పి. ప్రభుత్వం

- రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ, ఎంపి రఘురాంరెడ్డిలపై దాడి అమానుషం
- రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ - కొత్వాల
- కాంగ్రెస్, సిపిఐ, మిత్రపక్షాల ఆధ్వర్యంలో కొత్తగూడెంలో భారీ ప్రదర్శన
- మిత్రపక్షాలు, జిల్లాకాంగ్రెస్ అధ్యక్షురాలు దేవి ప్రసన్నతో పాటు పాల్గొన్న - కొత్వాల

ఈకాలం

ప్రజల ఓట్లను తొలగించి, కేంద్రం లోని బి.జె.పి. ప్రభుత్వం దేశ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నదని రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డిసిఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ కో ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ' సర్. ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలని, కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలని, సర్.ప్రక్రియలో అక్రమంగా తొలగించిన ఓట్లను తక్షణమే పునరుద్ధరించాలని, రాహుల్ గాంధీ పై దాడి అప్రజాస్వామికం అని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీలు, వివిధ ప్రజాసంఘాలు, ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో కొత్తగూడెం ఓల్డ్ డిపో సెంటర్ నుండి రైల్వేస్టేషన్ సెంటర్ వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ పాదయాత్ర అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, వివిధ పార్టీల మిత్రపక్షాలతో పాటు కొత్వాల పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ సర్ పేరుతో బి.జె.పి. యేతర పార్టీల ఓట్లు తొలగించి, తిరిగి



మరోసారి గద్దెనెక్కాలనే కుటిల యత్నాలకు బిజేపి పాల్పడుతున్నదని కొత్వాల అన్నారు. ఈ ప్రక్రియపై బుధవారం ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంపి లు ప్రియాంకగాంధీ, రామసహాయం రఘురామ్‌రెడ్డి లపై దాడికి పూనుకుందన్నారు. ఏది ఏమైనా ' సర్' పై ఆందోళన కార్యక్రమాలు, ఎన్నికల కమిషనర్ ను తొలగించేవరకు కాంగ్రెస్, మిత్రపక్షాల పోరాటం ఆగదని కొత్వాల హెచ్చరించారు.

# సీతారామ.. సత్తుపల్లి ట్రంక్ పనులకు వేగం భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి..

- రైతులకు పరిహారం అందించాలి
- నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మంత్రి తుమ్మల భేటీ
- ప్రాజెక్టులు పూర్తయితే లక్షల ఎకరాలకు సాగునీరు.. పలు మండలాలకు తాగునీటి భరోసా

ఈకాలం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు రైతుల భూములను సస్యశ్యామలం చేసే లక్ష్యంతో చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకం, సత్తుపల్లి ట్రంక్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు గురువారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో భేటీ అయి, ప్రాజెక్టుల పురోగతి, పెండింగ్ పనులు, భూసేకరణ, పైప్‌లైన్ నిర్మాణం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## సత్తుపల్లి ట్రంక్ పనులపైనా దృష్టి

సత్తుపల్లి ట్రంక్ పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరాన్ని మంత్రి తుమ్మల ప్రస్తావించారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, భూములు కోల్పోతున్న రైతులకు పరిహారాన్ని వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. ఈ పనులు పూర్తయితే సత్తుపల్లి, వేంసూరు మండలాల పరిధిలో సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు అవకాశం ఏర్పడుతుందని వివరించారు.రైతులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు వర్షాభావ పరిస్థితులు ఎదురైనప్పుడు ఆయకట్టు రైతులకు సాగునీటి భరోసా కల్పించడంలో ఈ ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని తుమ్మల పేర్కొన్నారు. సాగునీటి వనరులను సమర్థంగా వినియోగించుకునేలా పెండింగ్ పనులన్నింటినీ త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. సాగర్ ఆయకట్టు పరిధిలోని వైరా, లంకసాగర్ ప్రాంతాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా ఇటీవల నీటిని విడుదల చేసిన విషయాన్ని కూడా ప్రస్తావించారు.మంత్రి తుమ్మల విజ్ఞప్తులపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ప్రాజెక్టులకు



సంబంధించిన భూసేకరణ, పైప్‌లైన్, టన్నెల్ తదితర పనుల పురోగతిపై చర్చించారు. రైతులకు వీలైనంత త్వరగా సాగునీరు అందేలా పెండింగ్ పనులను వేగవంతం చేయడం, భూసేకరణ సమస్యలను పరిష్కరించడం కీలకమని ఈ సందర్భంగా స్పష్టమైంది.సీతారామ ఎత్తిపోతల పథకం సత్తుపల్లి ట్రంక్ పనులు పూర్తయితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు మండలాలకు సాగునీటి సౌకర్యం మెరుగుపడటంతో పాటు తాగునీటి అవసరాలకూ భరోసా లభించనుంది. ఈ నేపథ్యంలో పనుల వేగవంతం, భూసేకరణ పరిష్కారం, రైతులకు పరిహారం చెల్లింపులపై ప్రభుత్వం తీసుకునే చర్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# నాన్‌వెజ్ వ్యర్థాల సేకరణకు టెండర్ ఖరారు..

ఈకాలం

కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో చికెన్, మటన్, చేపల వ్యర్థాల సేకరణకు మున్సిపల్ అధికారులు ఆహ్వానించిన టెండర్లను గురువారం మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, టెండర్ నిర్వాహకుల సమక్షంలో ఓపెన్ చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన మొత్తం 9 సంస్థలు టెండర్లు దాఖలు చేయగా, ఇద్దరు ప్రతినిధులు గైర్హాజరయ్యారు. కనకదుర్గ ఎంటర్‌ప్రైజెస్ డీడీ సమర్పించకపోవడంతో ఆ సంస్థ టెండర్‌ను తిరస్కరించారు.మిగిలిన 8 సంస్థల టెండర్లను అధికారులు పరిశీలించారు. హైదరాబాద్‌కు చెందిన షా ఎంటర్‌ప్రైజెస్ రూ.2.34 లక్షలు



అత్యధిక మొత్తాన్ని కోట్ చేయడంతో ఆ సంస్థకు టెండర్ దక్కింది. ఇతర సంస్థలు మైనే ఫుడ్ అండ్ సీడ్స్ రూ.1.85 లక్షలు, ఆజాల్ ట్రేడర్స్ రూ.1.65 లక్షలు, మహబూబా ఎంటర్‌ప్రైజెస్ రూ.1.80 లక్షలు, తాజ్ ఎంటర్‌ప్రైజెస్ రూ.1.72 లక్షలు, ఎస్‌కేపీ ట్రేడర్స్ రూ.1.55 లక్షలు, మనం ఎంటర్‌ప్రైజెస్ రూ.1.80 లక్షలు చొప్పున టెండర్లు దాఖలు చేశాయి.ఈ సందర్భంగా కమిషనర్ పర్వతాలు మాట్లాడుతూ టెండర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. మున్సిపల్ నిబంధనలకు అనుగుణంగా చికెన్, మటన్, ఫిష్ వ్యర్థాలను సేకరించాలని టెండర్ దక్కించుకున్న సంస్థకు సూచించారు. కార్యక్రమంలో డీఈ హన్మంత్ రావు, టీపీఓ వినీత్ పాల్గొన్నారు.

# పెద్ద వాల్గోట్ కేజీబీవీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..

ఈకాలం

పెద్ద వాల్గోట్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని భోజనశాల, వంటగది, తరగతి గదులు, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజన నాణ్యత తదితర అంశాలపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల విద్య, వసతి, భోజనం, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.



# సూర్యాపేట పట్టణ అభివృద్ధికి పెద్దపీట

- డ్రెయిన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నివేదిత

ఈకాలం



సూర్యాపేట పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ నివేదిత అన్నారు. రూ.5 లక్షల వ్యయంతో పట్టణంలోని 18వ వార్డులో చేపట్టనున్న సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పట్టణంలో ప్రతి అవసరమైన మౌలిక వసతులను గుర్తించి దశలవారీగా పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. పట్టణ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 18 వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ రామ్మూర్తియాదవ్, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా , మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కాంగ్రెస్ నాయకులు మాలోత్ చంద్రునాయక్, నిమ్మల వెంకన్న, మున్సిపల్ ఈఈ ప్రణయ్ రెడ్డి, ఏఈ తిరుమలయ్య, వార్డు అధికారి నాగార్జున పాల్గొన్నారు.

# 43 వ వార్డు లో పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియ కార్యక్రమం



ఈకాలం

ఈరోజు గురువారం నాడు స్థానిక 43వ వార్డులో రానున్న వరంగల్,నల్గొండ,ఖమ్మం పట్టభద్రుల ఎలక్షన్ల కోసం జరుగు ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా మన ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధి ప్రదాత ,మాజీ మంత్రివర్యులు ,సూర్యాపేట శాసనసభ్యులు,గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఆదేశానుసారంగా 43వ వార్డు కౌన్సిలర్, శ్రీమతి బత్తుల ఝాన్సీలక్ష్మి రమేష్ ఆధ్వర్యంలో ఈరోజు ఓటరు నమోదు ప్రక్రియ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా అర్హులైన ఓటర్లకు ఫారాలు అందించడం ఏ విధంగా నింపాలో అవగాహన కల్పించినారు. నింపిన ఫారాలు మాకు అందించినచో ఆన్లైన్ చేసే ఇచ్చే బాధ్యత మాదే అని బత్తుల రమేష్ తెలిపినారు. ఈ కార్యక్రమంలో బాలశౌరి చవడం మీనయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు గ్రామంలో పలువురి కుటుంబాలను పరామర్శించిన డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి





ఈకాలం

హనుమకొండ జిల్లా ఆత్మకూరు గ్రామానికి చెందిన కి.శే. పొదిల సమ్మక్క ఇటీవల మరణించగా,గురువారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి తన గాఢ సానుభూతిని తెలియజేశారు.అదే గ్రామానికి చెందిన న్యాయవాది తనుగుల సన్నీ తండ్రి కి.శే. తనుగుల సాంబయ్య నిన్న కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకుని గురువారం వారి ఇంటికి వెళ్లి, సాంబయ్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తన సంతాపాన్ని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పర్వతగిరి రాజు మహేశ్వరి, రేవూరి జైపాల్ రెడ్డి, పలువురు స్థానిక నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానం అవసరం!









- వాస్తవ, విశ్వసనీయ సమాచారమే జర్నలిస్టుల లక్ష్యం కావాలి
- అక్రిడిటేషన్ల ప్రక్రియ ముగియగానే హెల్త్ కార్డులు అందిస్తాం
- తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

ఈకాలం, ఆదిలాబాద్

సమాజంలో నెలకొన్న ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ప్రజలకు ఎప్పటికప్పుడు వాస్తవ, విశ్వసనీయ సమాచారాన్ని అందించడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మీడియా రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో జర్నలిస్టులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని వృత్తి నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక టీటీడీసీ హాల్‌లో విలేకరులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ, ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, సోషల్ మీడియా రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వార్తల సేకరణ, వాస్తవ నిర్ధారణ, విశ్లేషణ, రచన, ప్రసారం వంటి ప్రతి దశలో జర్నలిస్టులు అప్రమత్తంగా వ్యవహరించాలని శ సూచించారు. సోషల్ మీడియా ద్వారా సమాచారం క్షణాల్లో విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ధ్రువీకరించని సమాచారాన్ని ప్రచారం చేయకుండా జాగ్రత్త వహించాలన్నారు. వార్తను వేగంగా అందించడం కంటే, వాస్తవాలను నిర్ధారించి బాధ్యతాయుతంగా ప్రజలకు అందించడం ముఖ్యమని స్పష్టం చేశారు. తప్పుడు వార్తలు, అసత్య ప్రచారాలకు తావులేకుండా ప్రజలకు సరైన సమాచారాన్ని అందించడమే పాత్రికేయుల ప్రధాన బాధ్యతగా ఉండాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగో స్థంభంగా ప్రజల తరఫున గొంతుకగా నిలుస్తోందని చైర్మన్ పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సేవల తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంలో స్థానిక విలేకరుల పాత్ర అభినందనీయమన్నారు. వార్తలో వేగం కంటే వాస్తవికత, విశ్వసనీయత, బాధ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. మారుతున్న మీడియా అవసరాలకు అనుగుణంగా జర్నలిస్టులకు శిక్షణ, మార్గదర్శకత్వం అందించేందుకు తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వాటి పరిష్కారానికి అకాడమీ తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటామని చైర్మెన్ తెలిపారు. అక్రిడిటేషన్ల ప్రక్రియ ముగియగానే ఉద్యోగుల తరహాల్లో జర్నలిస్టులకు హెల్త్ కార్డులు జారీ చేస్తామని వెల్లడించారు. రెండు రోజుల శిక్షణలో అనుభవజ్ఞులైన జర్నలిస్టులు, నిపుణులు వివిధ అంశాలపై అవగాహన కల్పించనున్నారని చెప్పారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని కొత్త విషయాలను నేర్చుకోవడంతో పాటు వృత్తి నైపుణ్యాలను మరింత పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వేంకటేశ్వరరావు, ఆర్టీఐ మాజీ కమిషనర్ దిలీప్ రెడ్డి, డీపీఆర్వో విష్ణు వర్ధన్, మీడియా అసోసియేషన్ ప్రతినిధులు మాదస్తు రాజేశ్వర్, నూకల దేవేందర్, బేత రమేష్, గంట వినోద్, మెడపట్ల సురేష్, సుభాష్, కిరణ్ తదితరులతో పాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా సంగారెడ్డి లో జగ్గారెడ్డి, నిర్మల దీక్ష




కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ చేపట్టిన పోరాటానికి మద్దతుగా దీక్షకు నిర్ణయంసంగారెడ్డిలోని ఓల్డ్ బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ కార్యకర్తలతో జగ్గారెడ్డి, నిర్మల సంఘీభావ దీక్ష రాత్రి 10 గంటల నుండి దీక్ష ను ప్రారంభించిన జగ్గారెడ్డి, నిర్మల దేశ ప్రజల ఓటు హక్కు కోసం రాహుల్ గాంధీ యుద్ధం చేస్తున్నారు రాహుల్ గాంధీ పోరాటం కొనసాగినంత కాలం మా దీక్ష కొనసాగుతుంది: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ దేశ ప్రజల ఓటు హక్కును, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించేందుకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఆయన సతీమణి నిర్మల జగ్గారెడ్డి సంగారెడ్డి ఓల్డ్ బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ వ్యవహారశైలిపై తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ బలపడిన రాష్ట్రాల్లో ఎన్నికల వ్యవస్థను తమకు అనుకూలంగా మార్చుకుని అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నించిందని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ సహకారంతోనే బీజేపీ మూడుసార్లు కేంద్రంలో అధికారంలోకి వచ్చిందని, ఈ అంశంపై రాహుల్ గాంధీ అనేక సందర్భాల్లో ప్రశ్నలు లేవనెత్తారని పేర్కొన్నారు. "ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ రాజకీయ పోరాటం కాదు.. దేశ ప్రజల ఓటు హక్కును కాపాడే రాజకీయ యుద్ధం. దేశ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ రోడ్డుపై కూర్చొని పోరాడుతున్నారు" అని జగ్గారెడ్డి అన్నారు.ా×= ప్రక్రియలోనూ ఎన్నికల కమిషన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించిన ఆయన, ఓటర్ల జాబితాల విషయంలో తలెత్తుతున్న వివాదాలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందన్నారు. దేశ ప్రజల ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ చేస్తున్న ఆరోపణలను ప్రస్తావించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాహుల్ గాంధీ చేస్తున్న ఉద్యమానికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని జగ్గారెడ్డి తెలిపారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ప్రతిపక్ష నేతలను పోలీసులు అడ్డుకోవడం, అదుపులోకి తీసుకోవడాన్ని ఆయన ఖండించారు. "రాహుల్ గాంధీ పోరాటం చేసినన్ని రోజులు సంగారెడ్డిలో మేము కూడా దీక్ష కొనసాగిస్తాం. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌కు మద్దతుగా మా పోరాటం కొనసాగుతుంది" అని స్పష్టం చేశారు. దేశంలో స్వతంత్ర ఎన్నికల వ్యవస్థకు పునాదులు పడిన కాలం నుంచి నెహ్రూ-- గాంధీ కుటుంబం ప్రజాస్వామ్య వ్యవస్థల పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చిందని జగ్గారెడ్డి పేర్కొన్నారు. మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు కోల్పోయారని, సోనియా గాంధీ సుదీర్ఘకాలం ప్రజా జీవితంలో సేవలందించారని గుర్తుచేశారు. "త్యాగాల చరిత్ర ఉన్న కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీ ఇప్పుడు దేశ ప్రజల ఓటు హక్కు కోసం పోరాడుతున్నారు. ఆయన పోరాటానికి ప్రజలంతా స్వచ్ఛందంగా మద్దతుగా నిలవాలి" అని జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. దీక్షలో నిర్మల జగ్గారెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని రాహుల్ గాంధీ చేపట్టిన ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు.

Eekalam News, printed and published by Devender Nukala, eekalam publications, printed at sunday printing press, h.no.361, bhagyalaxmi colony, medchal malkaj-giri, telangana 500054. Editor : Devender Nukala. eekalamnews@gmail.com, RNI(PRGI) No.TGTEL/25/A3149